జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక
హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 30 ॥సోమవారం ॥ 29-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## పీవీ జయంతి సందర్భంగా
# ఘన నివాళులు

### మాజీ ప్రధానికి సీఎం రేవంత్ పుష్పాంజలి
### మంత్రులతో కలిసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, జూన్ 28**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పాములప ర్తి వెంకట నరసింహారావు జయంతి సందర్భం గా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పీవీ దేశా నికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకు న్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్ కూడా పీవీ (మిగతా 2వ పేజీలో)





## మూసీ ప్రక్షాళన
# చేసి తీరుతాం

### నల్గొండలో రూ.83 కోట్ల తాగునీటి పథకానికి శంకుస్థాపన

### వచ్చే ఎన్నికల ఎస్ఎల్‌బీసీ పూర్తి
### ప్రజలకే ప్రాధాన్యం.. అభివృద్ధికే పెద్దపీట
### ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**నల్గొండ, జూన్ 28**

ఎలాంటి ఆటంకాలు ఎదురైనా మూసీ నది ప్రక్షాళనను పూర్తి చేసి తీరుతానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా కనగల్ మార్కెట్ యార్డులో (మిగతా 2వ పేజీలో)



## మోదీకి సెషెల్స్ అత్యున్నత
# గౌరవం

### 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' పురస్కారం ప్రదానం
### పర్యావరణ పరిరక్షణలో సేవలకు గుర్తింపు
### అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంకితం చేసిన ప్రధాని

## ద్వైపాక్షిక భాగస్వామ్యంపై
# ప్రత్యేక దృష్టి



### సెషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రధాని ప్రసంగం
### సెషెల్స్‌తో బంధం మరింత బలోపేతం
### ఆతిథ్యానికి సెషెల్స్ ప్రజలకు కృతజ్ఞతలు

**విక్టోరియా, జూన్ 28**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగిస్తూ ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు మరింత బలో పేతం అవుతున్నా యని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, అభివృద్ధి లక్ష్యాలే భారత్–సెషెల్స్ భాగ స్వామ్యానికి బలమైన పునాదులని అన్నారు. సెషెల్స్ ప్రజలు అందించిన ఆత్మీయ స్వాగతం, ఆతిథ్యానికి ఆయన హృద యపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. (మిగతా 2వ పేజీలో)



## కాంగ్రెస్ పాలనలో భూ దందా
# పెరిగిందని విమర్శ



- వికారాబాద్ భూములపై కేటీఆర్ ఆరోపణలు
- రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీశారని ఆరోపణ
- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగం

**వికారాబాద్, జూన్ 28**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికారాబాద్ జిల్లాలో భూ వ్యవహా రాలు వివాదాస్పదంగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నాడు బీఆర్ఎస్ పాలనలో వికారాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితే, (మిగతా 2వ పేజీలో)



## ప్రతి ఐదేళ్లలోపు చిన్నారులకు
## పోలియో చుక్కలు తప్పని సరి

### టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి రెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 28**

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం అందరి బాధ్యత అని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి రెడ్డి అన్నారు. జాతీ య పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవం తం చేయడం లో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. చిన్నారుల ఆరోగ్య వంతమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలే రక్షణ కవచమని అన్నారు. జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి (మిగతా 2వ పేజీలో)

## అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ
# ఆదర్శప్రాయం

### పిల్లుట్లలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
### ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



**మెదక్ ప్రతినిధి, జూన్ 28**

ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మంత్రి అన్నారు. చిన్నతనంలోనే కులవివక్షను ఎదుర్కొన్న ఆయన, విద్యనే ఆయుధంగా చేసుకొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని చెప్పారు. పుట్టుక మన చేతిలో ఉండదు... కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మన చేతిలోనే ఉంటుంది అనే అంబేడ్కర్ సందేశం నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ బహుభాషావేత్తగా, ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర తదితర రంగాల్లో విశేష (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఆప్తుల నుండి అవసరానికి ధన సహకారం అందుతుంది. పాత ఋణాల నుండి విముక్తి లభిస్తుంది. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపారపరంగా నూతన పెట్టుబడులు లభిస్తాయి. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: చుట్టుపక్కల వారితో ఆస్థి వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో ఆత్మ విశ్వాసంతో పని చేసి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

మిధునం: ఋణ ఒత్తిడి అధికమై మానసిక శిరో భాధలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో ఆప్తులతో పాల్గొంటారు. సంతాన విద్యా విషయంలో ఊహించని విషయాలు తెలుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు అతికష్టం మీద పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: మిత్రులకు మీ అభిప్రాయాలు నచ్చవు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలుంటాయి. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాల్లో సహోద్యోగులతో సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి.

సింహం: ఆర్థిక ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహరిస్తారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. వాహన యోగం ఉన్నది. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

తుల: ముఖ్యమైన విషయాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగమున విలువైన పత్రములు విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. చేపట్టిన పనులు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: కీలక వ్యవహారాలలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఇతరుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మకరం: చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆప్తులతో మాట పట్టింపులు కలుగుతాయి.

కుంభం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మీనం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు తప్పవు. ధన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఊహించని రీతిలో ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.



# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

(మొదటి పేజీ తరువాయి)

హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించిన అనంతరం నల్గొండ పట్టణంలో తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళన తన కల అని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆ పనిని పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపేలా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూసీ కాలుష్యం కారణంగా ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు, నల్గొండ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన ద్వారా ఆ ప్రాంత ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పిస్తామని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.వచ్చే ఎన్నికల నాటికి శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) ప్రాజెక్టును నూటికి నూరు శాతం పూర్తి చేసి కృష్ణా జలాలను నల్గొండ నేలకు తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. డిండి ప్రాజెక్టు పూర్తి చేయడానికీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో సాగునీటి వసతులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతి ప్రాజెక్టును వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. నల్గొండ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలు కోరిన ప్రతి పనిని పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. గత 30 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు రాష్ట్రంలోని 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం రూ.1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసి, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.ఉద్యోగాలు, విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా సీఎం ప్రస్తావించారు. 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించామని, ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు కులగణన నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నామని, నైపుణ్యాభివృద్ధికి స్కిల్స్ యూనివర్సిటీ, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులకు ముఖ్యమంత్రి చెక్కులు పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు ఆలోచించి తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పాలనలో భూ దందా పెరిగిందని విమర్శ

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు.వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై కూడా కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి, కృష్ణా రెడ్డి వికారాబాద్ జిల్లాలో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు దిక్కులా తిరుగుతూ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసిందని కేటీఆర్ విమర్శించారు.పెట్టుబడిదారుల్లో విశ్వాసం తగ్గిపోయిందని, భూముల కొనుగోలు, విక్రయాలపై అనిశ్చితి నెలకొన్నదని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలకు ప్రోత్సాహం లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు పారదర్శక విధానాలు అమలు చేశామని, దాని ఫలితంగానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగిందని అన్నారు.ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై పార్టీ తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించారు.

# పీవీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)



చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన రాజకీయ, పరిపాలనా సేవలను గుర్తు చేసుకున్నారు. దేశ ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దార్శనిక నాయకుడిగా, సమర్థవంతమైన పరిపాలకుడిగా పీవీ నరసింహారావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని నేతలు పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి, నాయకత్వం దేశాభివృద్ధికి కొత్త దిశను చూపిందన్నారు. తెలంగాణ గడ్డపై జన్మించి దేశ ప్రధానిగా అత్యున్నత స్థాయికి ఎదిగిన పీవీ నరసింహారావు ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణమని తెలిపారు. ఆయన సాహిత్య, రాజకీయ, పరిపాలనా రంగాల్లో చేసిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పీవీ నరసింహారావుకు ఘన నివాళులర్పించారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మోదీకి సెషెల్స్ అత్యున్నత గౌరవం

విక్టోరియా, జూన్ 28 (రథసారథి)

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సెషెల్స్ అత్యున్నత అధ్యక్ష పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్'ను ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ప్రదానం చేశారు. పర్యావరణ పరిరక్షణ, సముద్ర వనరుల సుస్థిర వినియోగం, వాతావరణ మార్పుల నియంత్రణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రధానికి అందజేశారు. భారత–సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పురస్కారం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ఈ గౌరవాన్ని కేవలం తన వ్యక్తిగత విజయంగా కాకుండా, పర్యావరణ పరిరక్షణ, వాతా వరణ మార్పుల నియంత్రణ కోసం కృషి చేస్తున్న ప్రపంచంలోని అన్ని దేశాలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.ప్రకృతి సంరక్షణ, సముద్ర పర్యావరణ పరిరక్షణ ప్రతి దేశం ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించేందుకు అంతర్జాతీయ సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. సముద్ర ఆర్థిక వ్యవస్థ (బ్లూ ఎకానమీ) అభివృద్ధి, చిన్న ద్వీప దేశాల అభివృద్ధి ఆకాంక్షలకు భారత్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని ప్రధాని పేర్కొన్నారు.సముద్ర వనరులను సుస్థిరంగా వినియోగించుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.భారత్–సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ గౌరవం ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని అన్నారు. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ చర్యలు, సుస్థిర అభివృద్ధి వంటి రంగాల్లో రెండు దేశాల సహకారం మరింత విస్తరించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెషెల్స్ ప్రభుత్వం కూడా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం అంతర్జాతీయ వేదికలపై భారత్ పోషిస్తున్న పాత్రను కొనియాడింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, సముద్ర వనరుల సంరక్షణలో మోదీ తీసుకున్న కార్యక్రమాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొంది.ఈ పురస్కారం భారత్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో గౌరవంగా భావిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ, బ్లూ ఎకానమీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ పోషిస్తున్న పాత్రకు ఇది గుర్తింపని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.భారత్–సెషెల్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలవనుంది.

# సెషెల్స్‌తో బంధం మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

భారత్, సెషెల్స్ మధ్య ఉన్న దీర్ఘకాలిక భాగస్వామ్యం సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నియంత్రణ, సుస్థిర అభివృద్ధి వంటి కీలక రంగాల్లో మరింత విస్తరిస్తోందని ప్రధాని చెప్పారు. చిన్న ద్వీప దేశాల అభివృద్ధికి భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంద ని,పరస్పర సహకారంతో కొత్త అవకాశాలను సృష్టించేందు కు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. జాతీయ అసెంబ్లీ సభ్యులతో సుమారు గంటపాటు జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలు, అభివృద్ధి సహకారం, ప్రజల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు మోదీ తెలిపారు. ఇరు దేశాల ప్రజల మధ్య స్నేహబంధం భవిష్యత్‌లో మరింత బలపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.భారత్–సెషెల్స్ దౌత్య సంబం ధాలకు 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందని ప్రధాని పేర్కొన్నారు.

# పోలియో చుక్కలు తప్పని సరి

(మొదటి పేజీ తరువాయి)

పల్స్ పోలియోకార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించా లన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లలిత కుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితా సంతోష్, కౌన్సిలర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

పాండిత్యం సంపాదించారని మంత్రి వివరించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేశారని, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారని గుర్తు చేశారు. భారతదేశానికి అంబేడ్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగమని మంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవన హక్కులను కల్పించిందని చెప్పారు. అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పిగా గౌరవిస్తామని అన్నారు. బాబాసాహెబ్ చూపిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు. యువత అంబేడ్కర్ జీవితాన్ని అధ్యయనం చేయడంతో పాటు రాజ్యాంగాన్ని తెలుసుకొని విద్యను తమ జీవితంలో శక్తివంతమైన ఆయుధంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్వేత సంపాదకీయం

**సోమవారం 29-6-2026**

# వెనిజువెలా విలయం!

పర్యావరణ విధ్వంసం కూడా భూకంపాలకు కారణమై ఉండొచ్చని నిపుణులు కొందరు అభిప్రాయ పడుతున్నారు. జాపన్ భూకంపాలకు నిలయం. అయితే ఇప్పుడు వెనిజువెలాలో జరిగిన భూకంప విలయం అంతా ఇంతా కాదు. ఏకకాలంలో పలు దేశాల్లో భూకంపాలు ఆందోళనకు గురిచేశాయి. ఇవి మానవులకు హెచ్చరిక కావాలి. వెనెజువెలాలో సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఇకపోతే లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంత కూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడి నట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది. ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు.

శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్,జర్మనీ,ఫ్రాన్స్, స్విట్జర్లాండ్,నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి. ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా ఇటీవల వాణిజ్యపరంగా ఆదేశంతో పలు ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు దెబ్బతిన్న వెనిజువెలాతో మనకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉ ందని నిపుణులు చెబుతున్నారు. భూ÷ఔకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉ ందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే వెనిజువెలా కోలుకుంటేనే మళ్లీ వ్యాపార కార్యకలాపాలు ముమ్మరం కానున్నాయి. అందువల్ల అప్పటి వరకు భారత్ వ్యాపారాలకు దెబ్బగానే భావించాలి.

# బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు థ్యాంక్స్..!

**'మన్ కీ బాత్'లో దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు**

**పశ్చిమాసియా సంక్షోభం వేళ భారతీయుల పొదుపు చర్యలపై ప్రశంసలు**

**నాగాలాండ్ 'విమెన్ ఫుట్‌సల్ లీగ్', అస్సాం 'హర్గిలా ఆర్మీ'పై ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, జూన్ 28: పశ్చిమాసియాలో నెలకొన్న భీకర యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో తన పిలుపునకు స్పందించి దేశంలో బంగారం కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిన దేశ పౌరులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ఆర్థిక స్థిరత్వాన్ని, విదేశీ మారక నిల్వలను కాపాడేందుకు వీలుగా సాధ్యమైనంత వరకు కొంతకాలం పాటు విలాసవంతమైన ఖర్చులు, ముఖ్యంగా బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని తాను చేసిన విజ్ఞప్తిని ప్రజలు అత్యంత బాధ్యతాయుతంగా స్వీకరించారని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతోమంది తమ ఇళ్లలో జరుగుతున్న వివాహాది శు భకార్యాలకు సైతం కొత్త బంగారం కొనకుండా, పాత నగలను రీసైకిల్ చేసుకుంటున్నామని సందేశాల ద్వారా తనతో పంచుకున్నారని వెల్లడించారు. అలాగే ఇంధనాన్ని ఆదా చేసేందుకు ఒకే మార్గంలో వెళ్లేవారు సొంత వాహనాలకు బదులుగా 'కార్ పూలింగ్' చేస్తున్నారని, పలువురు తమ విదేశీ ప్రయాణాలను కూడా వాయిదా వేసుకున్నట్లు సోషల్ మీడియాలో పేర్కొనడం దేశభక్తికి, ఉ మ్మడి బాధ్యతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు.

ఈ ప్రసంగంలో భాగంగా ప్రధాని మోదీ దేశ యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ ఈ విషయంలో నాగాలాండ్ రాష్ట్రం దేశానికే స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రశంసించారు. నాగాలాండ్‌లో 5 నుంచి 12 ఏళ్ల చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు 'నాగాలాండ్ బేబీ లీగ్' నడుస్తోందని.. అలాగే ఆడబిడ్డల్లోని అసాధారణ ప్రతిభను వెలికితీసేందుకు అక్కడ 'నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్' నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇండోర్ ఫుట్‌బాల్‌గా పిలిచే ఈ 'ఫుట్‌సల్' ఆటలో ప్రతి జట్టులో కేవలం ఐదుగురు ఆటగాళ్లే చిన్న మైదానంలో ఆడుతుంటారని, దీనివల్ల ఆటగాళ్లు చాలా వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇది మన ఆడబిడ్డల నైపుణ్యానికి అద్భుతమైన వేదికగా మారిందని మోదీ కొనియాడారు. మరోవైపు, పర్యావరణ పరిరక్షణలో అస్సాంకు చెందిన 'హర్గిలా ఆర్మీ' మహిళల అద్భుత పోరాటాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతరించిపోతున్న అరుదైన 'హర్గిలా' పక్షిని ఒకప్పుడు అశుభంగా భావించి, అవి గూళ్లు కట్టుకున్న చెట్లను కూడా నరికివేసేవారని, అయితే ఆ మూఢనమ్మకాలను జీవశాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్ పూర్తిగా మార్చివేశారని అభినందించారు. నాటి అపోహలను వీడి, నేడు ఆ పక్షుల సంరక్షణే ధ్యేయంగా హర్గిలా ఆర్మీ పర్యావరణ సమతుల్యతను కాపాడుతోందని ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు.



# కేతన్ హత్య కేసులో సీన్ రీక్రియేషన్

**ఘటనాస్థలానికి సియా గోయల్‌ను తీసుకెళ్లిన పోలీసులు**

**కేతన్‌ను లోయలోకి ఎలా తోసిందో వివరించిన నిందితురాలు**

**చేతన్‌ను విడిగా తీసుకెళ్తామని వెల్లడి**

పుణె, జూన్ 28: దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన పుణె బిజినెస్‌మ్యాన్ కేతన్ అగర్వాల్ (26) మృతి కేసు దర్యాప్తును పోలీసులు మరింత ఉధృతం చేశారు. ఈ కేసులో కుట్ర కోణాన్ని, నేరం జరిగిన తీరును పక్కాగా నిర్ధారించుకోవడానికి పుణె రూరల్ పోలీసులు ఆదివారం ఉదయం ఘటనాస్థలమైన ప్రముఖ లోహ్‌గఢ్ కోటలో సీన్ రీక్రియేషన్ చేపట్టారు. ఈ ప్రక్రియ కోసం ప్రధాన నిందితురాలు సియా గోయల్‌తో పాటు ఒక మానవ పరిమాణ డమ్మీని పోలీసులు కోట వద్దకు తీసుకెళ్లారు. కేతన్ చనిపోవడానికి ముందు అసలు అక్కడ ఏం జరిగిందో, అతడిని కోటపై నుంచి లోయలోకి ఎలా తోసివేశారో ప్రత్యక్షంగా చూపించాలని సియాను కోరారు. నేరం చేయడానికి తాము కోటపైకి వెళ్లిన మార్గంతో పాటు, కేతన్‌ను నెట్టేసిన ప్రాంతాన్ని సియా పోలీసులకు వివరించింది. ఈ సందర్భంగా సియా గోయల్‌ను పోలీసులు కట్టుదిట్టమైన భద్రత మధ్య కోట వద్దకు తీసుకెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మరో నిందితుడు, సియా ప్రియుడైన చేతన్ చౌదరిని కూడా సీన్ రీక్రియేషన్ కోసం విడిగా ఘటనాస్థలానికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు, ఈ ఘోర హత్యకు గల కారణాలు, నిందితుల ఆన్‌లైన్ యాక్టివిటీ మరియు డిజిటల్ లొకేషన్లపై పోలీసులు వివిధ కోణాల్లో లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. కేతన్‌ను వివాహం చేసుకోవడం ఇష్టం లేకనే, తన బంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ప్రియుడు చేతన్‌తో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సియా ఇప్పటికే పోలీసుల ఎదుట అంగీకరించింది. కాగా, సియా ఫోన్ ఎప్పుడూ బిజీగా వచ్చేదని, ఆమె తరచూ చేతన్ పేరును ప్రస్తావించేదని కేతన్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే, వారిద్దరి అక్రమ బంధానికి అడ్డుగా ఉన్నాడనే పగతోనే తన కుమారుడిని అత్యంత దారుణంగా హత్య చేశారని ఈ నెల 23వ తేదీన కేతన్ తండ్రి పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు సియా, చేతన్‌లపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కాగా, గతంలో నిందితులిద్దరూ కలిసి ఒక క్రికెట్ మ్యాచ్‌కు హాజరైన పాత దృశ్యాలు తాజాగా వెలుగులోకి రాగా.. సియా సోదరుడు సాహిల్ ద్వారానే వీరిద్దరికీ తొలి పరిచయం ఏర్పడినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.ఖ


**విదేశీ విద్యలో యూకేకు పెరుగుతున్న ఆదరణ...**

## భారతీయ విద్యార్థులు ఎందుకు ఆసక్తి చూపుతున్నారు?

ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో ఉన్నత విద్యకు అంతర్జాతీయ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. నాణ్యమైన విద్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందాలనే లక్ష్యంతో భారతీయ విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో యునైటెడ్ కింగ్‌డమ్ (ఖఖ) ప్రముఖ విద్యా గమ్యస్థానంగా నిలుస్తోంది.

ప్రపంచంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలకు నిలయమైన యూకే, విద్యా నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలు మరియు ఆధునిక బోధనా విధానాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడి విద్యా విధానం కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించేలా రూపొందించబడింది.

యూకేలో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన డిగ్రీలు లభిస్తాయి. తక్కువ కాలంలో కోర్సులను పూర్తి చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, చదువుతో పాటు పార్ట్-టైమ్ ఉద్యోగాలు చేసే వెసులుబాటు కూడా ఉంది. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలను అన్వేషించేందుకు అందుబాటులో ఉన్న Graduate Route వంటి అవకాశాలు కూడా విద్యార్థులకు అదనపు ప్రయోజనంగా మారుతున్నాయి.

విద్యతో పాటు విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి చదివే అవకాశం ఉండటం వల్ల అంతర్జాతీయ అనుభవం, సాంస్కృతిక అవగాహన మరియు ప్రపంచ దృక్పథం పెరుగుతాయి. ఇవి భవిష్యత్ కెరీర్ అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అయితే విదేశీ విద్య కోసం సరైన విశ్వవిద్యాలయం ఎంపిక, కోర్సు ఎంపిక, ప్రవేశ ప్రక్రియ, డాక్యుమెంటేషన్, స్కాలర్‌షిప్ అవకాశాలు, విద్యార్థి వీసా వంటి అంశాలపై పూర్తి అవగాహన ఉ ండటం అవసరం. సరైన ప్రణాళికతో ముందుకు సాగితే విదేశీ విద్య ప్రయాణం మరింత సులభమవుతుంది.

ఈ దిశగా జుశశజుజుూూూ జుసబఎ్‌ఐశీఋశ్రీ +తీశీబజూ విద్యార్థులకు సమగ్ర మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది. అర్హతలకు అనుగుణంగా యూనివర్సిటీలు, కోర్సుల ఎంపిక నుంచి అడ్మిషన్ ప్రక్రియ, ూూ తయారీ, డాక్యుమెంటేషన్, వీసా ఫైలింగ్, ప్రీ-డిపార్చర్ గైడెన్స్ వరకు ప్రతి దశలో నిపుణుల సేవలను అందిస్తూ విద్యార్థుల విదేశీ విద్య ప్రయాణానికి తోడ్పడుతోంది.

విదేశీ విద్యను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు ముందుగానే ప్రణాళిక రూపొందించుకుని, నిపుణుల సలహాలతో సరైన నిర్ణయాలు తీసుకుంటే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు.

**మరిన్ని వివరాలకు**

**EXXEELLA Educational Group**
Study in UK ö Admissions
Scholarships ö Student Visa Assistance
Your Global Education Partner



Bhanu Sairam Arepu
Education Counsellor
9100749422
applications@exxeella.com



# బలమైన వృద్ధిని నమోదు చేసిన భీమ్ పేమెంట్స్ యాప్ లావాదేవీలు

**నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ బీఎస్ఎల్) నుంచి వచ్చిన బీమ్ పేమెంట్స్ యాప్ గత 12 నెలల్లో బలమైన వృద్ధిని నమోదు చేసింది.**

(ఎన్బీఎస్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ లలిత నటరాజ్ మాట్లాడుతూ జూన్ 2025 నుండి మే 2026 వరకు ఈ యాప్‌లో జరిగిన లావాదేవీల పరిమాణం మూడు రెట్లకు పైగా పెరిగిందని, యాప్‌లో నెలవారీ లావాదేవీల సంఖ్య జూన్ 2025లో 7.964 కోట్ల (79.64 మిలియన్లు) నుండి మే 2026 నాటికి 24.4 కోట్ల (244 మిలియన్లు) లావాదేవీలకు పెరిగిందన్నారు. మే 2026లో ఈ వేదిక ద్వారా మొత్తం రూ. 26,952 కోట్ల విలువైన లావాదేవీలు ప్రాసెస్ చేయబడ్డాయి. ఇది దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపుల కోసం డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు.

తెలంగాణలో భీమ్ పేమెంట్స్ యాప్ వృద్ధి దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ధోరణిని ప్రతిబింబిస్తోందన్నారు. జూన్ 2025 నుండి మే 2026 వరకు లావాదేవీల పరిమాణం మూడు రెట్లు పెరిగింది. మే 2026లో రాష్ట్రంలో ఈ వేదికపై జరిగిన వ్యాపారుల (మర్చంట్) లావాదేవీలలో కిరాణా సరుకుల విభాగం 23.9 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఫుడ్ అవుట్‌లెట్లు 18.1 శాతం మరియు క్విక్ కామర్స్ 11.6 శాతం వాటా సాధించాయన్నారు. ఇతర ముఖ్యమైన విభాగాల్లో డెయిరీ మరియు బేకరీలు (3.2శాతం), ఇంధన కేంద్రాలు (2.8 శాతం ), ఈ-కామర్స్ (2.2 శాతం ), మరియు ప్రభుత్వ సేవలు (2.0 శాతం) ఉన్నాయని, ఇవి రోజువారీ ఖర్చుల్లో డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యం మరింత పెరుగుతున్నదాన్ని సూచిస్తున్నాయన్నారు. అలాగే, రాష్ట్రంలో యూపీఐ లైట్ మరియు రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ వంటి వినూత్న చెల్లింపు సౌకర్యాల వినియోగం కూడా పెరుగుతోందని, ఇది వినియోగదారులు మరింత సులభమైన, నిరంతరాయమైన మరియు క్రెడిట్ ఆధారిత చెల్లింపు ఎంపికలను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారని సూచిస్తోందన్నారు.

తెలంగాణలో భీమ్ పేమెంట్స్ యాప్ సాధించిన బలమైన వృద్ధి, డిజిటల్ చెల్లింపులు ప్రజల రోజువారీ జీవితంలో మరింతగా భాగమవుతున్నాయనే విషయాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ముఖ్యంగా, కిరాణా సరుకులు, ఫుడ్ అవుట్‌లెట్లు మరియు క్విక్ కామర్స్ వంటి విభాగాల్లో జరుగుతున్న లావాదేవీలు ఈ వృద్ధికి ప్రధాన కారణంగా ఉండటం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. ఇది సాధారణ రోజువారీ ఖర్చుల కోసం డిజిటల్ చెల్లింపుల వైపు వినియోగదారులు మరింతగా మొగ్గు చూపుతున్నారని సూచిస్తోంది. వినియోగదారులు మరింత సౌకర్యవంతమైన చెల్లింపు అనుభవాలను స్వీకరిస్తున్న ఈ సమయంలో, ప్రతి ఒక్కరికీ సులభమైన, నిరంతరాయమైన మరియు అందుబాటులో ఉండే పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై మేము దృష్టి సారిస్తున్నాము" అని తెలిపారు.

# భారీ ఫిషింగ్ ల్యాండింగ్ కేంద్రాలకు శ్రీకారం

**రూ.48.67 కోట్లతో రెండు కేంద్రాల నిర్మాణం**

**8,500 మందికి పైగా మత్స్యకారులకు లబ్ధి**

**మరో 4,440 మందికి ఉపాధి అవకాశాలు**



**అనకాపల్లి, జూన్ 28**

పాయకరావుపేట నియోజకవర్గంలోని మత్స్యకారుల చిరకాల ఆకాంక్షకు రూపుదిద్దుతూ రాజయ్యపేటలో రూ.48.67 కోట్ల వ్యయంతో నిర్మించనున్న దొండవాక, రాజయ్యపేట ఫిషింగ్ ల్యాండింగ్ కేంద్రాల (ఎఫ్ఎల్‌సీ) నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి అనిత, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద ఈ కేంద్రాలను నిర్మించనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఆధునిక మత్స్య ల్యాండింగ్ కేంద్రాల ఏర్పాటు ద్వారా మత్స్యకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు వారి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చేపల నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు అవసరమైన మౌలిక వసతులు ఈ కేంద్రాల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 8,500 మందికి పైగా మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని, అదనంగా 4,440 మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. తీరప్రాంత ప్రజల జీవనోపాధి మెరుగుపడటానికి ఈ కేంద్రాలు కీలకంగా నిలుస్తాయని చెప్పారు.

మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మత్స్యరంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ, ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

# మరో రెండు రోజులు వర్షాల హెచ్చరిక



**ద్రోణి ప్రభావంతో మేఘావృత వాతావరణం**

**మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

**అమరావతి, జూన్ 28**


ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు రోజుల పాటు మేఘావృతమైన వాతావరణం కొనసాగడంతో పాటు పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండీ ప్రకర్ జైన్ తెలిపారు.

వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, జిల్లాల వారీగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. భారీ వర్షాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదులు, వాగులు, కాలువల సమీపంలో నివసించే వారు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సూచించారు. అవసరం లేకుండా వరద నీటిలోకి వెళ్లకూడదని, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు తాజా వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా పరిశీలించాలని, రైతులు కూడా వ్యవసాయ పనులు చేపట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని ఏపీఎస్‌డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను మాత్రమే నమ్మి అప్రమత్తంగా ఉండాలని ప్రకర్ జైన్ సూచించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- **కువైట్, బహ్రెయిన్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు**
- **క్షిపణులు, డ్రోన్లతో ప్రతీకార చర్యలు**
- **కాల్పుల విరమణ ఒప్పందంపై మళ్లీ సందిగ్ధం**



**డెస్క్, జూన్ 28**

పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చాయి. కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిపినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగినట్లు ఇరాన్ వెల్లడించింది. అమెరికా ఇటీవల ఇరాన్ భూభాగంలోని సైనిక స్థావరాలపై దాడులు నిర్వహిం చిందని, వాటికి ప్రతీకారంగానే ఈ చర్యలు చేపట్టినట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో చమురు ట్యాంకర్‌పై జరిగిన డ్రోన్ దాడి అనంతరం అమెరికా ఇరాన్ లక్ష్యాలపై వైమానిక దాడులు చేసినట్లు సమాచారం. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. జూన్ 17న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తాజా దాడులతో తీవ్ర ఒత్తిడికి గురైంది. శాంతి చర్చలను నిలిపివేసే అవకాశమున్నట్లు ఇరాన్ హెచ్చరించింది. ఈ దాడులను కువైట్, బహ్రెయిన్ తీవ్రంగా ఖండించాయి. తమ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంటూ అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌పై తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ, కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మరోవైపు, ఒప్పందాన్ని ముందుగా అమెరికాయే ఉల్లంఘించిందని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ దాడుల్లో అమెరికా సైనికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే బహ్రెయిన్‌లో ఒక నివాస భవనం దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. కువైట్‌లో పలువురు క్షిపణులను వైమానిక రక్షణ వ్యవస్థ అడ్డుకున్నట్లు సమాచారం. ఇరాన్--అమెరికా మధ్య తాజా ఘర్షణలతో గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు మళ్లీ ఆందోళనకరంగా మారాయి. హోర్ముజ్ జల సంధి పరిసరాల్లో చమురు రవాణా, సముద్ర వాణిజ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఇరుపక్షాలు సంయమనం పాటించాలని ఖతార్, యూఏఈ, జోర్డాన్ తదితర దేశాలు విజ్ఞప్తి చేశాయి.



# లండన్‌లో తెలంగాణ విద్యార్థి మృతి

**కామారెడ్డి, జూన్ 28**

ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లిన తెలంగాణకు చెందిన విద్యార్థి శ్రీనాథ్ రెడ్డి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన మధుసూధన్ రెడ్డి కుమారుడు శ్రీనాథ్ రెడ్డి సుమారు 14 నెలల క్రితం ఎంఎస్ చదువుకోడానికి లండన్ వెళ్లి అక్కడ స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ఈ నెల 22న రాత్రి శ్రీనాథ్ చివరిసారిగా ఇంటికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. ఎప్పటిలాగే ఉత్సాహంగా మాట్లాడిన అతడు అదే రోజు స్నేహితుల పుట్టినరోజు వేడుకకు హాజరైనట్లు తెలిపారు. అయితే మరుసటి రోజు ఉదయం తన గదిలో మృతదేహంగా కనిపించినట్లు స్నేహితులు సమాచారం అందించారు. శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని అతని రూమ్‌మేట్లు చెబుతున్నప్పటికీ, కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని నమ్మడం లేదు. ముందు రోజు వరకు ఎలాంటి ఆందోళన లేకుండా సాధారణంగా మాట్లాడిన వ్యక్తి ఒక్కసారిగా ఆత్మహత్యకు పాల్పడటం అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి శ్రీనాథ్ మృతి హత్యా, ఆత్మహత్యా అన్న విషయాన్ని పూర్తిగా వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ కేసులో వాస్తవాలను నిష్పక్షపాతంగా విచారించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విదేశీ అధికారులతో సమన్వయం చేసి పూర్తి స్థాయి విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్రీనాథ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనాథ్ మృతిపై పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తులోనే తేలనున్నాయి.



# వర్షాకాల విహారానికి భండార్దారా బెస్ట్

**డెస్క్, జూన్ 28**

వర్షాకాలంలో ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులకు మహారాష్ట్రలోని అహల్యానగర్ జిల్లాలో ఉన్న భండార్దారా హిల్ స్టేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పచ్చని కొండలు, జలపాతాలు, ప్రవర సరస్సు, ఆహ్లాదకరమైన లోయలతో ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వర్షాలు ప్రారంభమైన తర్వాత భండార్దారా ప్రాంతం మరింత సుందరంగా మారడంతో ప్రతి ఏడాది వేలాది మంది పర్యాటకులు ఇక్కడికి తరలివస్తున్నారు. సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య విరాజిల్లే భండార్దారా ప్రకృతి అందాలకు ప్రసిద్ధి చెందింది. వర్షాకాలంలో కొండలపై దట్టమైన పచ్చదనం అలుముకోవడం, అనేక జలపాతాలు ఉప్పొంగి ప్రవహించడం ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రశాంత వాతావరణం, స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులకు మరపురాని అనుభూతిని అందిస్తాయి.



# పోలియో నిర్మూలనకు మూడు రోజుల మహాయజ్ఞం

**చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సీఎం**

**49.20 లక్షల మందికి లక్ష్యంగా కార్యక్రమం**

**ప్రతి చిన్నారికి టీకా అందించాలని పిలుపు**

**అమరావతి, జూన్ 28**

జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. చిన్నారులను ఎత్తుకుని ముద్దాడుతూ వారి ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత రాష్ట్ర నిర్మాణానికి సహకరించాలని సూచించారు. అధికారుల వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఐదేళ్లలోపు ఉన్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలు, మారుమూల ప్రాంతాలు సహా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇంటింటికీ వెళ్లి అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష

**న్యూఢిల్లీ, జూన్ 28**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ నెల 20 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇప్పటికే అక్కడ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష ప్రారంభించిన అనంతరం సోనమ్ వాంగ్‌చుక్ మాట్లాడుతూ తమ ఉద్యమం కేవలం నీట్ పరీక్షకు పరిమితం కాదని, దేశంలోని మొత్తం విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీజేపీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం, నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన లోపాల కారణంగా దేశవ్యాప్తంగా 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపించారు. వారి స్మారకార్థం దీక్షా స్థలంలో ప్రత్యేక స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు.



# కార్మిక వాడలో రేనే వైద్య శిబిరం

**గోదావరిఖని, జూన్ 28**

సింగరేణి కార్మిక బిడ్డ "రెనీ" అధినేత డాక్టర్ బంగారు స్వామి నేతృత్వంలో 'ఖని" సింగరేణి ఏరియా హాస్పటల్‌లోని రెనీ కార్డిక్ కేర్ సెంటర్ నిర్వహణలో ఐదవ డివిజన్ కార్పోరేటర్ సత్య ప్రసాద్ అధ్వర్యంలో గంగా నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా గుండె సంబంధిత వైద్య పరీక్షలను, మందులను అందించారు. ఈ శిబిరంలో డాక్టర్లు తులసి రామ్, సాయి వేంకటేష్, సంతానం, శ్రీనివాస్ రావు, క్రాంతి, తేజస్వినీ వైద్య సేవలను అందిచక సుమారు రెండు వందల మంది వైద్య సేవలు అందుకున్నారు.

# సీఎం, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

**జూలై 2 పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం**

**ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు**

**అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు**



**తిరుపతి, జూన్ 28**

జూలై 2న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. పర్యటన మార్గాలు, సభా ప్రాంగణాలు, ముఖ్య కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

పర్యటన సందర్భంగా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# పీవీకి ఘన నివాళులు

**105వ జయంతి సందర్భంగా జ్ఞానభూమిలో నివాళి**

**పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు**

**పీవీ సేవలను స్మరించిన నేతలు**



**హైదరాబాద్, జూన్ 28**

మాజీ ప్రధాని, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు 105వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పీవీ జ్ఞానభూమి వద్ద పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. భారత ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దార్శనిక నాయకుడిగా, పరిపాలనలో విశిష్ట ముద్ర వేసిన మహానేతగా పీవీని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పీవీ జ్ఞానభూమి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పీవీ నరసింహారావు దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో కీలక పాత్ర పోషించారని, విదేశాంగం, విద్య, పరిపాలన రంగాల్లో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బహుభాషా కోవిదుడిగా, దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. దేశ అభివృద్ధికి పీవీ నరసింహారావు చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయాలను కొనసాగించడం బాధ్యత అని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

- **తెలంగాణ ఉద్యమ త్యాగాలను స్మరించిన బీఆర్ఎస్ నేతలు**
- **ఆరోగ్య బాధ్యతను పార్టీ తీసుకుంటుందని హామీ**
- **అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా**



**రంగారెడ్డి, జూన్ 28**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం గ్రామంలో తెలంగాణ ఉద్యమ అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు యాదిరెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో యాదిరెడ్డి చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టిని ఆకర్షించాలనే సంకల్పంతో పార్లమెంట్ సమీపంలో ఆత్మబలిదానం చేసుకున్న యాదిరెడ్డి త్యాగం ఉద్యమానికి గొప్ప స్ఫూర్తిగా నిలిచిందన్నారు. తెలంగాణ ఉన్నంతకాలం అమరవీరుల త్యాగాలను ఎవరూ మరచిపోలేరని పేర్కొన్నారు. యాదిరెడ్డి మరణానంతరం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు అండగా నిలిచిందని కేటీఆర్ గుర్తు చేశారు. యాదిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, 500 గజాల స్థలం, రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తన వంతు బాధ్యత నిర్వర్తించిందని, వారి త్యాగానికి ఎంత చేసినా తక్కువేనని అన్నారు. పరామర్శ సందర్భంగా యాదిరెడ్డి తల్లి, సోదరుడు తమ ఆరోగ్య సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని కేటీఆర్ తెలిపారు. వారి ఆరోగ్య బాధ్యతను పార్టీ పరంగా తామే తీసుకుంటామని, అవసరమైన వైద్య సహాయాన్ని అందించి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన ఫోన్ నంబర్‌ను కుటుంబ సభ్యులకు అందజేసి, ఎలాంటి అవసరం వచ్చినా వెంటనే సంప్రదించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వందలాది మంది అమరవీరుల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో కమలం వికసిస్తుంది

**బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం**

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై మల్కాజిగిరి ఎంపీ విమర్శలు**

**వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యమని స్పష్టం**



**హైదరాబాద్, జూన్ 28**

తెలంగాణలో ప్రతి బూత్‌లో కమలం వికసించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌తో పాటు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ బలం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పార్టీ 48 స్థానాలు గెలుచుకుని బలమైన ప్రత్యామ్నాయంగా నిలిచిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఐదు లోక్‌సభ స్థానాల్లో నాలుగు స్థానాలను బీజేపీ గెలుచుకుందని, రాబోయే ఎన్నికల్లో కూడా అదే విజయాన్ని పునరావృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.



# సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తం

**ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య అధికారులతో మంత్రి సమీక్ష**

**డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రత్యేక కార్యాచరణ**

**గ్రామ స్థాయిలో యాక్టివ్ సర్వైలెన్స్‌కు ఆదేశాలు**

**విశాఖపట్నం, జూన్ 28**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన జిల్లాల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో యాక్టివ్ సర్వైలెన్స్ నిర్వహిస్తూ జ్వరాల కేసులను వెంటనే గుర్తించి పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, అధిక ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే (ఐఆర్ఎస్), మాస్ ఫీవర్ సర్వేలు, ఫాగింగ్ కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలను వేగవంతం చేసి వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. పారిశుద్ధ్య చర్యలు, నిల్వ నీటి తొలగింపు, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షల సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.



# మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

**కావలిలో రెహమాన్ చిత్రపటానికి నివాళులు**

**కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా**

**ఎమ్మెల్యేతో కలిసి పరామర్శించిన మంత్రి పొంగూరు నారాయణ**

**కావలి, జూన్ 28**

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎస్సీ ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవల అకాల మరణం చెందిన జానీ తండ్రి రెహమాన్ కుటుంబాన్ని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ కలిసి పరామర్శించారు. కావలి పట్టణంలోని 40వ వార్డులోని వారి నివాసానికి వెళ్లి రెహమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన ప్రజాప్రతినిధులు, రెహమాన్ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ శాఖలో సేవలందించిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఉద్యోగి కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మృతుడికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# తెలంగాణలో కమలం వికసింపజేద్దాం

**బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం**

**ఎస్ఐఆర్‌లో కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేశాయని విమర్శ**

హైదరాబాద్, జూన్ 28

తెలంగాణలో ప్రతి బూత్‌ను బలోపేతం చేసి రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణతో భారతీయ జనతా పార్టీకి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దివంగత సుష్మా స్వరాజ్ చేసిన కృషిని గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రజలతో బీజేపీకి ఉన్న బంధం మరింత బలపడుతుందని అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని పారదర్శకత, ఖచ్చితత్వం, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కిషన్ రెడ్డి కోరారు. ప్రతి అర్హుడైన ఓటరికి ఓటు హక్కు అందేలా కృషి చేయాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణతో పాటు పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలవుతున్నాయని తెలిపారు. తెలంగాణలో కూడా ద్వంద్వ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారెం టీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయని, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టాయని ఆరోపించారు. ప్రజలకు నిజమైన ప్రత్యా మ్నాయం బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు డి.కె. అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్, గోదం నగేశ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సౌదీలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం

రియాద్, జూన్ 28

సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ రంగ చమురు దిగ్గజ సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ ఆదివారం ఉదయం కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై ఇంధన మంత్రిత్వ శాఖ అధికారికంగా సమాచారం అందించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు వెల్లడికాలేదు. హెలికాప్టర్ సాంకేతిక లోపం వల్ల కూలిందా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో దర్యాప్తు కొనసా గుతోంది. ఘటనపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం ప్రమాదానికి గల అసలు కారణాలను వెల్లడించ నున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అవసరమైన అన్ని విధాల సహాయ సహకా రాలు అందిస్తామని పేర్కొంది. మృతుల గుర్తింపు, ఇతర వివరాలను సంబంధిత కుటుంబాలకు తెలియ జేస్తున్నట్లు సమాచారం. రస్ తనూరా ప్రాంతం సౌదీ అరే బియా ఇంధన రంగానికి కీలకమైన కేంద్రంగా గుర్తింపు పొందింది. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినళ్లలో ఒకటి ఇక్కడ ఉండటంతో ఈ ప్రాంతా నికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది.

# రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

**మత్కెపల్లిలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల తనిఖీ**



ఖమ్మం, జూన్ 28

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం మత్కెపల్లి క్రాస్ రోడ్–జగన్నాథపురం గ్రామంలో ఈ నెల 29న నిర్వ హించనున్న రైతు మేళా, 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనే రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. వ్యవసాయ, సహకార శాఖ ప్రభు త్వ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక ఎమ్మెల్యే లు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సభా ప్రాంగణం, ప్రధాన వేదిక, రైతులు కూర్చునే ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను మంత్రిపరిశీలించారు. వాతావరణ శాఖ మరో రెండు రోజుల పాటు వర్షాలు కురి సే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో సభకు హాజరయ్యే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముం దస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికా రులను ఆదేశించారు. వర్షం వచ్చినా కా ర్యక్రమానికి అంత రాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచా లని సూచించారు. సభా ప్రాంగణంలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవ డంతో పాటు పా ర్కింగ్, వాహనాల రాకపోకలు, రైతుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పకడ్బ ందీగా ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# భైంసాలో రూ.30.32 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- 440 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభం
- తాగునీటి ఆధునికీకరణ పనులకు భూమిపూజ
- అభివృద్ధికి నిధుల కొరత లేదన్న మంత్రి జూపల్లి



నిర్మల్, జూన్ 28

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో రూ.30.32 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేసి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నిర్మించిన 440 డబుల్ బెడ్‌రూమ్ గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు, గృహ పట్టాలను అందజేశారు. అనంతరం అమృత్ పథకం కింద రూ.28.18 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ, కొత్త పైప్‌లైన్ల నిర్మాణం తదితర పనులకు భూమిపూజ నిర్వహించారు. రూ.2.14 కోట్లతో చేపట్టనున్న మహదేవ్ పూర్ చెరువు పునరుద్ధరణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పనులు పూర్తయిన తర్వాత భైంసా పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. చెరువు పునరుద్ధ రణతో భూగర్భ జలాల మట్టాలు పెరిగి ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరు తాయని పేర్కొ న్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకా రం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని, భైంసా అభి వృద్ధికి నిధుల కొరత లేదని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- హామలీవాడ, భాగ్యనగర్ కాలనీల్లో క్షేత్రస్థాయి తనిఖీ
- ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ
- అవగాహన కల్పించాలని అధికారులకు సూచనలు



అదిలాబాద్, జూన్ 28

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆదివారం అదిలాబాద్ పట్టణంలోని హామలీవాడ, భాగ్యనగర్ కాలనీల్లో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షిషా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను తనిఖీ చేసి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాలనీల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఫారాల్లో కోరిన వివరాలను పూర్తిగా, సక్రమంగా నమోదు చేసి నిర్ణీత గడువులోగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని ఓటర్లకు సూచించారు. ఓటరు జాబితాల ఖచ్చిత త్వానికి ప్రతి ఒక్కరి సహకారం అవసర మని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటిం టికీ వెళ్లి ఫారాల పంపిణీ, వివరాల సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఫారాలు నింపడం లో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ పద్మావార్ రాకేష్, గంట జీవన్, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, కాలనీ వాసులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమానికి ఘన శ్రీకారం

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మంత్రులు
- బోరబండ యూపీహెచ్‌సీలో జాతీయ పల్స్ పోలియో దినోత్సవం



హైదరాబాద్, జూన్ 28

జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పోలియో రహిత తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే పుట్టిన శిశు వు నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో టీకాల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డా. సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డా. రవీంద్రకుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## కాలువల్లో చెత్తే వరదలకు కారణం

హైదరాబాద్, జూన్ 28

నగరంలో వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణకు హైడ్రా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో మురుగు, వరద కాలువల నుంచి భారీ మొత్తంలో చెత్త బయటపడుతోంది. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కేబుల్ వైర్లు, గృహోపకరణాలు, పూడికను తొలగిస్తూ వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా హైడ్రా అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. ప్రజలు నిర్లక్ష్యంగా కాలువల్లో వేస్తున్న చెత్తే వరదలకు ప్రధాన కారణమవుతోందని అధికారులు హెచ్చరిస్తున్నారు. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తూ జీహెచ్ఎంసీ, ఇతర మున్సిపల్ సంస్థలు, నీటిపారుదల శాఖ, పోలీసు శాఖలతో కలిసి కాలువలను శుభ్రం చేస్తున్నాయి. ప్రతి వర్షం తర్వాత పెద్దఎత్తున చెత్త కాలువల్లోకి చేరి నీటి ప్రవాహాన్ని అడ్డుకుం టోందని, దీంతో కాలనీలు, రహదారులు నీటమునిగే పరిస్థితులు ఏర్పడుతు న్నాయని అధికారులు తెలిపారు. మెహిదీపట్నం, మల్లేపల్లి, విజయనగర్ కాలనీ మీదుగా మూసీలో కలిసే ఆఘాపురా నాలాలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. స్థానికుల ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న హైడ్రా బృందాలు ఆరు రోజులుగా నిరంతరంగా పనులు నిర్వహించి ఇప్పటికే 13 టిప్పర్ల చెత్తను తొలగించాయి. పరుపులు, దిండ్లు, సోఫాలు, కుర్చీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా బయటపడగా, మరో రెండు రోజుల్లో మొత్తం కాలు వను పూర్తిగా శుభ్రం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మియాపూర్–పటాన్‌చెరు మార్గంలోని బాక్స్ డ్రైన్‌లో కేబుల్ వైర్లు భారీగా పేరుకుపోవడం తో వర్షపు నీరు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. జేసీబీల సాయం తో కాలువను శు భ్రం చేయగా పెద్ద మొత్తంలో కేబుల్ వైర్లు, ఇతర చెత్త బయటపడింది. అలాగే చందానగర్–



## నైరుతి జోరు తగ్గింది

**దేశంలో వర్షాల కొరత**

జూన్ 28

నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. కొద్ది రోజుల పాటు చురుగ్గా సాగిన రుతుపవనాలు ప్రస్తుతం పూర్తిగా బలహీనపడటంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 28 నాటికి దేశంలో సాధారణంతో పోలిస్తే 45 శాతం వర్షపాత లోటు నమోదైనట్లు వాతావరణ గణాంకాలు వెల్లడించాయి. ఈ పరిస్థితి ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ 4 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా సాధారణంగా 141.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా, ఈసారి కేవలం 77.1 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. వారం రోజుల క్రితం 40 శాతంగా ఉన్న వర్షపాత లోటు ఇప్పుడు 45 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, వ్యవసాయ కార్యకలాపాలు మందగించడం, విద్యుత్ వినియోగం పెరగడం వంటి సమస్యలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఉ పగ్రహ చిత్రాల ప్రకారం మధ్య, పశ్చిమ, వాయవ్య భారతదేశంలోని విస్తార ప్రాంతాల్లో ఆకాశం మేఘరహితంగా ఉంది. కేవలం ఈశాన్య రాష్ట్రాలు, ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతూ ప్రజలు తీవ్ర ఉ క్కపోతను ఎదుర్కొంటున్నారు. రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తుండగా సాగు పనులు అనేక చోట్ల నిలిచిపోయాయి. రాష్ట్రాల వారీగా చూస్తే గుజరాత్‌లో 86 శాతం, మహారాష్ట్రలో 60

# వర్షం అడ్డంకి.. గెలుపు దిశగా భారత్ ఏ



**గాలే, జూన్ 28**

భారత్ ఏ, శ్రీలంక ఏ జట్ల మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. నాలుగో రోజు భారత్ ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 189/8 వద్ద డిక్లేర్ చేసి శ్రీలంకకు 312 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలర్లు చెలరేగి ఆతిథ్య జట్టుకు ఆదిలోనే రెండు వికెట్ల షాక్ ఇచ్చారు.మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన అకీబ్ నబీ ధార్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తన జోరు కొనసాగించాడు. ఓపెనర్ పవంత వీరసింఘే (20)ను బౌల్డ్ చేసి శ్రీలంకకు తొలి దెబ్బ తీశాడు. అనంతరం హర్ష్ దూబే బౌలింగ్‌లో నిరోషన్ డిక్‌వెల్లా (9) వెనుదిరిగాడు. దీంతో శ్రీలంక ఏ జట్టు 34 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి అషెన్ బండార (1 నాటౌట్), నువనిందు ఫెర్నాండో (2 నాటౌట్) క్రీజులో ఉన్నారు. 6.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 37 పరుగులు చేసిన శ్రీలంక విజయానికి ఇంకా 275 పరుగులు అవసరం.

**తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఆధిక్యం**

మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 113/2తో ఆట ప్రారంభించిన శ్రీలంక ఏ జట్టు 330 పరుగులకు ఆలౌటైంది. నువనిందు ఫెర్నాండో (84), అంజల బండార (70) పోరాడినా భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అకీబ్ నబీ 4/58తో మెరిసగా, యశ్ ఠాకూర్ 2 వికెట్లు తీశాడు. దీంతో భారత్ ఏకు 160 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**సాయి, జురెల్ శతకాల జోరు**

భారత్ ఏ తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సాయి సుదర్శన్ (132), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (141 నాటౌట్) అద్భుత శతకాలతో జట్టును భారీ స్కోరుకు చేర్చారు. షేక్ రషీద్ (63) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడగా, భారత్ ఏ తొలి ఇన్నింగ్స్‌ను 452/6 వద్ద డిక్లేర్ చేసింది. అదే ఆధిక్యం మ్యాచ్‌లో ప్రస్తుతం భారత్‌ను విజయానికి చేరువ చేసింది.



# చివరి బంతికి సిక్స్..

## భారత సంతతి క్రికెటర్ హీరో

**ముంబై జూన్ 28**

అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్-2026లో భారత సంతతి క్రికెటర్ నిఖిల్ చౌదరీ హీరోగా నిలిచాడు. టెక్సాస్ సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో చివరి బంతికి సిక్స్ బాది వాషింగ్టన్ ఫ్రీడమ్‌కు ఒక వికెట్ తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 185 పరుగులు చేసింది. డొనోవన్ ఫెరీరా (44 నాటౌట్), వియాన్ ముల్డర్ (43 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడగా, సాయితేజ ముక్కామల్ల 37 పరుగులతో రాణించాడు. వాషింగ్టన్ బౌలర్లలో నిఖిల్ చౌదరీ రెండు వికెట్లు పడగొట్టాడు.

**చివరి బంతికి సిక్స్**

186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్‌కు మిచెల్ ఓవెన్ (77), స్టీవ్ స్మిత్ (30) శుభారంభం అందించారు. అయితే వరుసగా వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది.చివరి ఓవర్లో విజయానికి ఆరు పరుగులు అవసరమవగా, టెక్సాస్ బౌలర్ హొసెన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తొలి బంతికి పరుగులివ్వకుండా, తర్వాతి మూడు బంతుల్లో హ్యాట్రిక్ వికెట్లు తీసి మ్యాచ్‌ను టెక్సాస్ వైపు తిప్పాడు. చివరి బంతికి ఐదు పరుగులు అవసరమైన పరిస్థితిలో నిఖిల్ చౌదరీ భారీ సిక్స్ బాది వాషింగ్టన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న నిఖిల్ చౌదరీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**ఎవరీ నిఖిల్ చౌదరీ?**

నిఖిల్ చౌదరీ ఢిల్లీలో జన్మించగా, అతని కుటుంబ మూలాలు పంజాబ్‌కు చెందినవి. మొదట ఫాస్ట్ బౌలర్‌గా కెరీర్ ప్రారంభించిన అతడు తర్వాత ఆఫ్ స్పిన్నర్‌గా, అనంతరం లెగ్ స్పిన్నర్‌గా మారాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ఎంపికై బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ఆడాడు. అలాగే బిగ్‌బాష్ లీగ్‌లో ఆడిన రెండో భారత సంతతి క్రికెటర్‌గా కూడా నిఖిల్ రికార్డు సృష్టించాడు.

## భారత్ జట్టుకు బెల్‌ఫాస్ట్‌లో

# ఘన స్వాగతం

*ఐర్లాండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు బెల్‌ఫాస్ట్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఘన స్వాగతం లభించింది. కాన్సులేట్ జనరల్ కిరణ్ ఖత్రీ భారత ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందిని ఆప్యాయంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కిరణ్ ఖత్రీ మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చే శక్తివంతమైన క్రీడ అని పేర్కొన్నారు. అనంతరం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ భారత క్రికెట్ ప్రయాణం, జట్టు లక్ష్యాల గురించి మాట్లాడారు.*

**బెల్‌ఫాస్ట్, జూన్ 28**

ఈ కార్యక్రమానికి ఐర్లాండ్‌లోని ప్రవాస భారతీయులు, పలువురు విశిష్ట అతిథులు హాజరయ్యారు. కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది.

సిరీస్ సమంపై భారత్ గురి

మరోవైపు తొలి టీ20లో ఓటమి చవిచూసిన భారత్ రెండో మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి మ్యాచ్‌లో ఐర్లాండ్‌ను 182 పరుగులకే కట్టడి చేసినప్పటికీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు విఫలమయ్యారు.

ఓపెనర్ అభిషేక్ శర్మ అర్ధశతకంతో పోరాడినా, ఐర్లాండ్ పేసర్లు మాథ్యూ హొలార్డ్ మూడు వికెట్లు, అరంగేట్ర ఆటగాడు జై ముంద్రా రెండు వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశారు. ఫలితంగా ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది.





# నేటి నుంచే ఫిఫా నాకౌట్ సమరం

**ఫిఫా జూన్ 28**

ప్రపంచకప్-2026లో లీగ్ దశ ముగియడంతో నేటి నుంచి నాకౌట్ పోరుకు తెరలేవనుంది. 12 గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన 24 జట్లతో పాటు, అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఎనిమిది మూడో స్థాన జట్లు కలిపి మొత్తం 32 జట్లు 32వ రౌండ్‌లో బరిలోకి దిగుతున్నాయి.చివరి గ్రూప్ మ్యాచ్‌లో అల్జీరియా, ఆస్ట్రియా జట్లు 3-3తో డ్రా కావడంతో రెండూ నాకౌట్‌కు అర్హత సాధించాయి. దీంతో 32వ రౌండ్‌కు చేరిన జట్ల జాబితా పూర్తయింది. నేటి తొలి మ్యాచ్‌లో ఆతిథ్య కెనడా, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.

32వ రౌండ్ మ్యాచ్‌ల షెడ్యూల్

జూన్ 29

- కెనడా ఐ దక్షిణాఫ్రికా - ఉదయం 12:30
- బ్రెజిల్ ఐ జపాన్ - రాత్రి 10:30

**జూన్ 30**

- జర్మనీ ఐ పరాగ్వే - ఉదయం 2:30
- నెదర్లాండ్స్ ఐ మొరాకో -- ఉదయం 6:30
- ఐవరీ కోస్ట్ ఐ నార్వే -- రాత్రి 10:30

**జూలై 1**

- ఫ్రాన్స్ ఐ స్వీడన్ -- ఉదయం 2:30
- మెక్సికో ఐ ఈక్వెడార్ -- ఉదయం 6:30
- ఇంగ్లండ్ ఐ డీఆర్ కాంగో -- రాత్రి 9:30

**జూలై 2**

- బెల్జియం ఐ సెనెగల్ -- ఉదయం 1:30
- అమెరికా ఐ బోస్నియా-హెర్జెగొవినా -- ఉదయం 5:30

**జూలై 3**

- స్పెయిన్ ఐ ఆస్ట్రియా -- ఉదయం 12:30
- పోర్చుగల్ ఐ క్రొయేషియా -- ఉదయం 4:30
- స్విట్జర్లాండ్ ఐ అల్జీరియా -- ఉదయం 8:30
- ఆస్ట్రేలియా ఐ ఈజిప్ట్ -- రాత్రి 11:30

**జూలై 4**

- అర్జెంటీనా ఐ కాబో వెర్డె -- ఉదయం 3:30
- కొలంబియా ఐ ఘనా -- ఉదయం 7:00




# బంగ్లాకు కాప్ షాక్..

# తొలి 10 ఓవర్లలో 47/2

**ముంబై జూన్ 28**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలక లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్‌ను సఫారీ పేసర్లు ఒత్తిడిలోకి నెట్టారు. తొలి 10 ఓవర్లు ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది.

మరిజానే కాప్ తొలి ఓవర్ తొలి బంతికే ఓపెనర్ ఫిర్దౌస్‌ను ఖాతా తెరవకుండానే బౌల్డ్ చేసి దక్షిణాఫ్రికాకు శుభారంభం అందించింది. అనంతరం షబ్నం ఇస్మాయిల్ తన వేగంతో తేజ్ నెహర్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ పంపింది. దీంతో 14 పరుగులకే బంగ్లాదేశ్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది.

ఆ తర్వాత శోభనా మోస్త్రే (27 నాటౌట్), షర్మీన్ అక్తర్ (13 నాటౌట్) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ జాగ్రత్తగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపించారు.

సెమీస్ ఆశల కోసం పోరు

గ్రూప్-ఏ నుంచి సెమీఫైనల్ బెర్తు కోసం దక్షిణాఫ్రికాకు ఈ మ్యాచ్ అత్యంత కీలకం. మరోవైపు టోర్నీ నుంచి నిష్క్రమించే దశలో ఉన్న బంగ్లాదేశ్, ప్రొటీస్ జట్టు అవకాశాలను దెబ్బతీయాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. దీంతో ఈ పోరు ఆసక్తికరంగా సాగుతోంది.

# మెస్సీ ఖాతాలో మరో అరుదైన రికార్డు

*అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో గోల్ చేసిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జోర్డాన్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఫ్రీకిక్‌ను అద్భుతంగా గోల్‌గా మలిచి ఈ రికార్డును అందుకున్నాడు.ఈ మ్యాచ్‌లో మెస్సీ ఆరంభ జట్టులో లేకపోయినా, 60వ నిమిషంలో ప్రత్యామ్నాయ ఆటగాడిగా మైదానంలోకి దిగాడు. 80వ నిమిషంలో లభించిన ఫ్రీకిక్‌ను గోల్‌గా మలిచి అర్జెంటీనా విజయాన్ని ఖాయం చేశాడు.*

**డల్లాస్, జూన్ 28**

ప్రపంచకప్‌లో 19 గోల్స్ఈ గోల్‌తో ప్రపంచకప్ టోర్నీల్లో మెస్సీ మొత్తం గోల్స్ సంఖ్య 19కి చేరింది. దీంతో తన ఆల్‌టైమ్ రికార్డును మరింత మెరుగుపరుచుకున్నాడు. అలాగే ప్రస్తుత గోల్డెన్ బూట్ రేసులో కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలె, వినిసియస్ జూనియర్, ఎర్లింగ్ హాలాండ్‌ల కంటే రెండు గోల్స్ ఆధిక్యంలో నిలిచాడు.



**ఆరు ప్రపంచకప్‌లలో మరో ఘనత**

మెస్సీ గోల్స్ పరంపర 2022 ఖతార్ ప్రపంచకప్ నాకౌట్ దశలో ప్రారంభమైంది. రౌండ్ ఆఫ్-16, క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్‌తో పాటు ప్రస్తుత టోర్నీలోనూ వరుసగా గోల్స్ నమోదు చేశాడు. అల్జీరియాపై హ్యాట్రిక్, ఆస్ట్రియాపై రెండు గోల్స్ చేసి తన జోరును కొనసాగించాడు.

ఇది మెస్సీకి ఆరో ఫిఫా ప్రపంచకప్. 2006, 2010, 2014, 2018, 2022, 2026 ప్రపంచకప్‌లలో బరిలోకి దిగిన ఏకైక పురుష ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా కూడా అతడు మరో చారిత్రక ఘనత సాధించాడు. నాకౌట్ దశకు అర్జెంటీనా చేరుకోవడంతో మెస్సీ ఖాతాలో మరిన్ని రికార్డులు చేరే అవకాశముంది.



# శివరాజ్‌కుమార్‌తో భయమేసింది

**నటి నభా నటేష్ తన సినీ ప్రయాణం, సహనటులతో కలిసి పనిచేసిన అనుభవాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ప్రస్తుతం 'నాగబంధం' సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విశేషాలు పంచుకున్నారు.**

కన్నడ సినీ పరిశ్రమలో తన కెరీర్ ప్రారంభమైందని గుర్తుచేసుకున్న నభా నటేష్, తొలి చిత్రంలోనే నటుడు శివరాజ్‌కుమార్‌తో నటించే అవకాశం రావడం ఆనందంగా అనిపించినప్పటికీ, ఆయన స్టార్ ఇమేజ్‌ను చూసి మొదట చాలా భయపడ్డానని తెలిపారు.ఆ సినిమాలో గుర్రంపై స్వారీ చేయడం, బీడీ తాగడం వంటి మాస్ లక్షణాలు ఉన్న పాత్రను పోషించానని, ఆ తరహా పాత్రను మళ్లీ చేయలేదని చెప్పారు. శివరాజ్‌కుమార్ సినిమాలు చూస్తూ పెరిగిన తనకు, ఆయనతో ఒకే తెరపై నటించడం మొదట్లో ఎంతో టెన్షన్ కలిగించిందని పేర్కొన్నారు.ప్రస్తుతం 'నాగబంధం'తో పాటు 'స్వయంభు' చిత్రాల్లో నటిస్తున్న నభా నటేష్, ఈ రెండు చిత్రాలు తన కెరీర్‌లో భిన్నమైన అనుభవాలను అందించాయని తెలిపారు. ముఖ్యంగా 'స్వయంభు'లో తన పాత్ర శక్తివంతంగా ఉంటుందని, ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం వ్యక్తం చేశారు.


## క్లిన్ కారా ఫొటోపై బన్నీ స్పందన వైరల్

**మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కుమార్తె క్లిన్ కారా ఫొటోపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్పందించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఆయన స్పందించిన చిత్రం అసలు ఫొటో కాకుండా కృత్రిమ మేధతో రూపొందించిన చిత్రమని తర్వాత వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది.'పెద్ది' సినిమా విజయానంతరం క్లిన్ కారా మూడో పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ కుటుంబం చిన్నారి ఫొటోను అభిమానులతో పంచుకుంది.**

హైదరాబాద్, జూన్ 28.

ఈ నేపథ్యంలో ఓ అభిమానుల ఖాతాలో క్లిన్ కారా పేరుతో కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన చిత్రం కూడా వైరల్ అయింది.ఆ చిత్రాన్ని నిజమైనదిగా భావించిన అల్లు అర్జున్ హార్ట్ గుర్తుతో స్పందించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అనంతరం అది కృత్రిమ మేధతో రూపొందించిన చిత్రం అని తెలిసినా, తన మేనకోడలిపై ఉన్న అభిమానాన్నే బన్నీ వ్యక్తం చేశారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఈ సంఘటనతో మెగా, అల్లు కుటుంబాల మధ్య ఉన్న అనుబంధం మరోసారి చర్చనీయాంశమైంది. ఫొటో నిజమా కాదా అన్నది పక్కన పెడితే, అల్లు అర్జున్ స్పందన అభిమానులను ఆకట్టుకుంటోంది.ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.





## 'మా ఇంటి బంగారం'కు సీక్వెల్..

### నిర్మాత ప్రకటన

హైదరాబాద్, జూన్ 28,

హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, సమంత నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఈ చిత్రం దాదాపు రూ.70 కోట్ల గ్రాస్ వసూళ్లకు చేరువైనట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.సినిమా విజయోత్సవ వేడుకలో నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ, 'మా ఇంటి బంగారం'కు సీక్వెల్ రూపొందించనున్నట్లు ప్రకటించారు. రెండో భాగానికి సంబంధించిన కథా లైన్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలోనే ప్రాజెక్ట్‌ను ప్రారంభించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు.మొదటి భాగం కంటే సీక్వెల్‌ను మరింత భారీ స్థాయిలో తెరకెక్కించాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇది కథకు కొనసాగింపుగా వస్తుందా? లేక ప్రధాన పాత్ర గతాన్ని ఆవిష్కరించే ప్రీక్వెల్‌గా రూపొందుతుందా? అనే అంశంపై సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఇదే సమయంలో సమంత కొంతకాలం విరామం తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో రెండో భాగంలో ఆమెనే కొనసాగిస్తారా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.మరోవైపు ఈ కథను తొలుత సాయిపల్లవిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేసినట్లు నిర్మాత గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో 'మా ఇంటి బంగారం-2'లో సాయిపల్లవి నటించే అవకాశాలపై కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.అయితే సమంత కొనసాగుతారా? సాయిపల్లవి నటిస్తారా? లేక కొత్త పాత్రలు చేరనున్నాయా? అనే విషయాలపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.



## భాగ్యరాజ్‌కు తుది వీడ్కోలు..

చెన్నై, జూన్ 29,


ప్రముఖ దర్శకుడు, నటుడు, కథా రచయిత కె. భాగ్యరాజ్ ఆకస్మిక మరణం సినీ పరిశ్రమను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఆయన పార్థివ దేహాన్ని అభిమానులు, సినీ ప్రముఖుల సందర్శన కోసం నివాసంలో ఉంచగా, అక్కడ చోటుచేసుకున్న ఓ దృశ్యం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది.భాగ్యరాజ్ ఎంతో ప్రేమగా పెంచుకున్న పెంపుడు కుక్క తన యజమాని పార్థివ దేహం చుట్టూ తిరుగుతూ, శవపేటిక వద్ద మౌనంగా నిలబడింది. ఆ మూగజీవి ప్రవర్తన అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. యజమాని ఇక లేరనే విషయాన్ని అర్థం చేసుకున్నట్లుగా కనిపించిన ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.ఈ వీడియోలను చూసిన నెటిజన్లు జంతువుల విశ్వాసాన్ని ప్రశంసిస్తూ భావోద్వేగ వ్యాఖ్యలు చేస్తున్నారు. మాటలతో చెప్పలేని ఆ ప్రేమ, ఆప్యాయత ఆ మూగజీవి ప్రవర్తనలో స్పష్టంగా కనిపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.భాగ్యరాజ్ మృతికి సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పలువురు నటీనటులు, దర్శకులు, అభిమానులు ఆయనకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారతీయ సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో భాగ్యరాజ్ అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో ఆయనకు తుది వీడ్కోలు పలికారు. కథా రచయితగా, దర్శకుడిగా, నటుడిగా భారతీయ చిత్రసీమపై చెరగని ముద్ర వేసిన భాగ్యరాజ్ మరణం సినీ పరిశ్రమకు తీరని లోటుగా నిలిచింది.

## 'స్పిరిట్'లో స్పెషల్ సాంగ్ సందడి?

హైదరాబాద్, జూన్ 28.

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'స్పిరిట్' గురించి మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. త్వరలో ప్రారంభం కానున్న తదుపరి షెడ్యూల్‌లో ఓ ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ పాటలో కథానాయిక తృప్తి దిమ్రితో పాటు మరో బాలీవుడ్ నటి కూడా కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఆ నటి ఎవరు అన్న విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ పాట కోసం భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.సందీప్ రెడ్డి వంగా తన చిత్రాల్లో పాటలను కథలో భాగంగానే తీర్చిదిద్దుతుంటారు. దీంతో 'స్పిరిట్'లోని ఈ ప్రత్యేక గీతం కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు.ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారిగా శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలకు సమపాళ్లలో ప్రాధాన్యం ఇస్తూ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

సంగీత బాధ్యతలను హర్షవర్ధన్ రామేశ్వర్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు సంగీత సమావేశాలు పూర్తయ్యాయని, ఈ చిత్రానికి నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం.




"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467